మహబూబ్‌నగర్ జిల్లా చక్రాపూర్ శివారులోని తన పొలంలో 700 ఫీట్ల లోతుకు బోరు డ్రిల్లింగ్ చేయించినా చుక్క నీరు రాకపోవడంతో పైపుపై బండరాయి పెడుతున్న రైతు ఉప్పరి మల్లేశ్

రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలంలో బోరు వేయిస్తున్న రైతు యాగిరెడ్డి

నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పిట్టంపల్లిలో బోరు వేస్తున్న దృశ్యం

ఊరూరా కన్నీటి బోర్లు!

రాష్ట్రవ్యాప్తంగా రైతుల బోర్ల ఖర్చు రూ.500 కోట్లు

- చెరువులు, కుంటలు ఎండుముఖం
- పంటల రక్షణకు అన్నదాతల తండ్లాట
- సాగునీటికి కొత్తగా బోర్లు, బావులు
- రైతులకు తడిసి మోపెడవుతున్న భారం
- ఒక్కోబోరుకు కనీసం 30-50 వేల ఖర్చు
- మోటారు, పైపులతో కలిపి లక్షకుపైనే
- అప్పులు చేసి బోర్లు తవ్విస్తున్నవైనం
- కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన తంటా

హైదరాబాద్, మార్చి 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అన్నదాతల ఆశల సాగుకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. అనాలోచిత నిర్ణయాలు, కక్షసాధింపు రాజకీయాలతో ప్రాజెక్టులను పడావు పెట్టడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. చెరువులు, కుంటలు ఎండిపోయి బోర్లు, బావులు ఒట్టిపోతున్నాయి. మొన్నటి వరకు మూడు నాలుగు ఎకరాలకు నీరందించిన బోరు ఇప్పుడు అరెకరం తడపడమే గగనమైపోతున్నది. సర్కారు సృష్టించిన ఈ సాగు నీటి కష్టాలతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. కండ్లముందే ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మళ్లీ పాతరోజులకు మళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో బోర్లు, బావులు వేసేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బోరు బావులు తవ్వుతున్నారు. కష్టమైనా సరే అప్పులు చేసి మరీ కొత్తగా బోర్లు, బావులు తవ్విస్తున్నరు. దీంతో గ్రామాల్లోకి బోరు బండ్లు క్యూకడుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా భూమికి చిల్లులు పొడుస్తున్నయి. ఏ గ్రామంలో చూసినా బోరు బండ్ల చప్పుళ్లు వినపడుతున్నాయి. పంటలు ఎండిపోయి, పెట్టుబడులు రాక అప్పులే దిక్కువుతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడెనిమిదేళ్లుగా సాగు నీళ్ల కోసం నిశ్చింతగా ఉన్న రైతన్నకు మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కరువు ఛాయలు చూపిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'కాంగ్రెస్ సర్కారు వచ్చింది.. కరువు తెచ్చింది' అంటూ ఊరూరా రైతులు తిట్టిపోస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక చెరువులు, కుంటలను నీళ్లతో నింపడమే మానేసింది. ఫలితంగా బోరు బావుల్లోకి నీళ్ల ఊటలు బంద్ అయి ఒట్టిపోతున్నాయి. దీంతో పంటలకు నీళ్లు కరువయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు మళ్లీ కొత్తగా బోర్లు, బావులు తవ్విస్తున్నారు.

లక్షలు పెట్టి బోర్లేయిస్తున్న ఎల్లారెడ్డిపేట రైతులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాలకు పదేండ్ల నుంచి ఏ కరువు లేదు. ఈసారి సాగు నీళ్లు లేక మండల రైతులు విలవిల్లాడుతున్నాయి. మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, గుంటపల్లి చెరువుతండా, కిష్టూనాయక్ తండా, రాజన్నపేట, దేవునిగుట్ట తండా, గొల్లపల్లి, బాకుర్‌పల్లి, తిమ్మాపూర్‌లో 180 ఎకరాల్లో నీటి ఎద్దడి సమస్య ఉన్నట్టు అధికారిక అంచనా. పలువురు రైతులు లక్షలు పెట్టి బోర్లు వేయిస్తున్నరు. అయినా ఫలితం దక్కడం లేదు. ఇంకొందరు పంటలెండిపోయి పశువులను మేతకు విడిచిపెట్టారు. 'నేను రెండు లక్షలు పెట్టి మూడు బోర్లేసిన. మొత్తం ఫెయిలైపోయినయ్. కేటీఆర్ సార్ మొన్న దేవునిగుట్ట తండాకు వచ్చి నీళ్లియ్య కుంటే ధర్నా చేస్తమనేసరికి కాల్వల్ల నీళ్లచ్చినయ్. ఈ నీళ్లు రాకపోతే మొత్తం మునుగుడయితుండె. బోర్ల అప్పులే మిగిల్నయ్' అని బుగ్గరాజేశ్వర తండాకు చెందిన బానోత్ రాజునాయక్ తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో బోరును చూపిస్తున్న బానోత్ రాజునాయక్

నెలరోజుల్లో లక్షకు పైగా బోర్లు

ఒక్కో రైతు తన భూమి, స్థోమతను బట్టి 2 నుంచి 5 బోర్లు వేయిస్తున్నారు. ఇప్పటికే ఒక్కో గ్రామంలో సగటున 8 నుంచి 10 బోర్ల చొప్పున వేసినట్టుగా తెలుస్తున్నది. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత నెల రోజుల్లో ఒక్కో ఊరిలో సగటున కొత్తగా 30 నుంచి 40 బోర్లు వేసినట్టు బోర్ బండి యజమానులే చెప్తున్నారు. ఈ లెక్కన నెల రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష బోర్లు వేసినట్టు బోర్ వెల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్తున్నారు. ఇంకా కొత్త బోర్ల సంఖ్య రెట్టింపు అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నెలరోజుల్లో 150 నుంచి 200 బోర్లు వేసినట్టు ఓ బోరుబండి యజమాని చెప్పడం తీవ్రతకు అద్దంపడుతున్నది.

తగ్గిన బోర్ల సక్సెస్ రేట్

రైతులు పెద్ద ఎత్తున బోర్లు వేస్తున్నప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో ఫలితం దక్కడం లేదు. బోర్ల సక్సెస్ రేటు 20-30 శాతం మాత్రమే ఉన్నట్టుగా తెలుస్తున్నది. ఒక గ్రామంలో 5 బోర్లు వేస్తే అందులో ఒకటి లేదా రెండు మాత్రమే సక్సెస్ అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 500 అడుగుల లోతు వేసినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పడిన కొన్ని బోర్లలో కనీసం ఒక్క ఇంచు నీళ్లు కూడా పడటం లేదు. దీంతో ఆ బోరులో నీళ్లు పడినా.. ప్రయోజనం ఉండటం లేదు.

సంగారెడ్డి జిల్లాలోని ఫసల్‌వాదిలో కాలిపోయిన మోటరుకు మరమ్మతులు చేస్తున్న రైతులు

అప్పులకూపంలోకి రాష్ట్ర రైతాంగం

రాష్ట్రవ్యాప్తంగా కొత్త బోర్ల కోసం రైతులు రూ.500 కోట్లు ఖర్చు చేసినట్టు ఓ అంచనా. ఒక్కో బోరుకు కనీసం రూ.30-50 వేలు ఖర్చవుతుంది. నీళ్లు పడకుంటే మిగిలేది అప్పులే. పడితే మోటరు, పైపులు, వైరు, ఇతర ఖర్చులు కలిపి రూ.లక్ష నుంచి రూ.1.2 లక్షల వరకు ఖర్చవుతుంది. ప్రతి రైతు సగటున 250 ఫీట్ల నుంచి 500 ఫీట్ల వరకు బోర్లు వేయిస్తున్నారు. ఈ విధంగా ఒక్కో రైతు కొత్త బోర్ల కోసం కనీసం రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారని అంచనా. ఈ విధంగా ఒక్కో బోరుకు ఖర్చు సగటున రూ.50 వేలుగా లెక్కిస్తే, ఇప్పటికే లక్ష బోర్లు వేసినట్టు అంచనా. అంటే సాగు నీళ్ల కోసం పరితపిస్తున్న రైతులు ఈ రూ.500 కోట్లను అప్పులు, రుణాలుగా తీసుకొని బోర్లకు పెట్టడం సంచలనంగా మారింది.

అడుగంటిన భూగర్భజలాలు

బీఆర్ఎస్‌పై కక్షతో కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో చెరువులు, కుంటలకు నీళ్లు కరువయ్యాయి. చెరువులపై ఆధారపడ్డ బోర్లు, బావులు ఎండిపోయాయి. వెరసి పంటలకు నీళ్లు కరువయ్యాయి. రైతులకు కన్నీళ్లు మాత్రమే మిగిలాయి. వేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు రాష్ట్రవ్యాప్తంగా సగటున 2 మీటర్ల లోతుకు పడిపోవడం ఆందోళనకరం. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో అన్నదాత విలవిల్లాడుతున్నారు. చేతకొచ్చే దశలో పంటలు ఎండిపోవడంతో పశువులకు మేతగా వదులుతున్నారు. సర్కారు నిర్లక్ష్య వైఖరితో ఈ వేసవిలో రాష్ట్ర రైతాంగం సాగునీటి కోసం అరిగోస పడుతున్నది.

పంటజెడగొట్టి బోరేసినా పడలే..

నాలుగెకరాల పంట ఎండిపోతుంటే సూడలేకపోయిన. బోరు బండి రావడానికే 10 గుంటల పంట పొలాన్ని చెడగొట్టి తొవ్వ జేసేందుకు రూ.20 వేలు ఖర్చు చేసిన. అక్కడ రూ.1.10 లక్షలు పెట్టి పాత బోరు స్థలంలో కొత్త బోరేసిన. అయినా నీళ్లు పడలె. సూడబుద్ధిగాక మల్లొక్క దగ్గర రూ.90 వేలు పెట్టి 650 ఫీట్ల బోరేయించిన. సుక్క నీళ్లు రాలె. పొలానికి కాల్వ నీళ్లే దిక్కని మల్లొక రూ.లక్ష పెట్టి పైపులు తెచ్చి మల్కపేట కాల్వకేసిన. ఇప్పుడైతే నీళ్లు రాలె. వస్తన్నయంటున్నరు. ఎంత జేసినా నాకున్న నాలుగెకరాల్లో రెండెకరాలు ఎండిపోయేట్టున్నది.

- భూక్యా మోహన్, రైతు, దేవునిగుట్ట తండా, ఎల్లారెడ్డిపేట

ఇవీ లెక్కలు

- ఒక్కో రైతు సగటున 2 నుంచి 5 బోర్ల చొప్పున వేస్తున్నారు
- ఒక్కో బోరుకు రూ.30-50 వేల ఖర్చు (నీళ్లు పడకపోతే నష్టమే)
- కొన్ని నీళ్లైనా పడితే మోటరు ఖర్చులు రూ.లక్ష నుంచి 1.2 లక్షలు
- ఒక్క నెలలోనే ఒక్కో గ్రామంలో సగటున 8-10 బోర్లు వేస్తున్నారు
- ఇలా రాష్ట్రవ్యాప్తంగా వేసిన బోర్ల సంఖ్య లక్షరాల లక్షగా అంచనా
- ఒక్కో బోరుకు రూ.50 వేలైనా రాష్ట్రవ్యాప్తంగా రూ.500 కోట్లు

అంతుచిక్కని రెస్క్యూ ఆపరేషన్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సాగుతున్న సహాయ చర్యలు
- 15రోజులైనా దొరకని 8 మంది జాడ
- ఇంకా గుర్తించని ప్రత్యేక జాగిలాలు
- ఘటనా స్థలం నుంచి తొలగని మట్టి
- టీబీఎం శకలాలు బయటకు తరలింపు
- వినియోగంలోకి రాని కన్వేయర్ బెల్ట్
- ఇది జాతీయ విపత్తు: మంత్రి ఉత్తమ్

నాగర్‌కర్నూల్, మార్చి 8: ఎల్ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్‌కు అంతుచిక్కడమే లేదు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ఆచూకీ తెలియరాలేదు. 15 రోజులైనా వారి జాడ ఇంకా కనిపించలేదు. ఆ 8 మంది జాడకోసం 11 రెస్క్యూ బృందాల్లోని దాదాపు 580 మందికిపైగా సభ్యులతో సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం దక్కడం లేదు. నిపుణులు క్షుణ్ణంగా టన్నెల్‌లోకి వెళ్లి పరిశీలిస్తున్నా ఆపరేషన్ ఒక కొలిక్కి రావడంలేదు. రాడార్ ద్వారా గుర్తించిన స్థానాల్లో శనివారం రెండుచోట్ల పూర్తిస్థాయిలో మట్టిని తొలగించినప్పటికీ కార్మికుల ఆచూకీ కనిపించలేదని తెలిసింది. కేరళ నుంచి రప్పించిన ప్రత్యేక జాగిలాలు సైతం కార్మికుల జాడను గుర్తించలేకపోయాయి. రాడార్ మిషన్ ద్వారా గుర్తించిన స్థలాన్నే జాగిలాలు సైతం గుర్తించినా స్పష్టత రాలేదని రెస్క్యూ బృందాలు పేర్కొంటున్నాయి. జాగిలాలు మరోసారి శనివారం ఉదయం సైతం వెళ్లినా ఫలితం మాత్రం శూన్యం. ఇదేరోజు పెద్దసంఖ్యలో రెస్క్యూ బందాలు వెళ్లి సహాయక చర్యలు చేపట్టాయి. టీబీఎంకింద శకలాల తొలగింపు కూడా ఇంకా కొనసాగుతూనే ఉన్నది. మద్రాస్ ఐఐటీ బృందంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం దక్కలేదు. మట్టి, మురదను తరలించేందుకు కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేపడుతున్నా అది ఇంకా వినియోగంలోకి రాలేదు. ఎన్జీఆర్ఐ, జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, క్యాడవర్ డాగ్ బృందం, ర్యాట్ మైనర్స్, రోబోటిక్ రంగాల నిపుణులు ఎన్ని రకాలుగా ప్రయత్నించినా కార్మికుల జాడను మాత్రం గుర్తించలేదు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

టన్నెల్ ప్రమాదం జాతీయ విపత్తు: మంత్రి ఉత్తమ్

దోమలపెంట ఎస్ఎల్‌బీసీ వద్ద జరిగిన ప్రమాద ఘటన జాతీయ విపత్తు అని, సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి సహాయ చర్యలు కొనసాగుతున్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సహాయ చర్యలను కొనసాగించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని చెప్పారు. శనివారం ఆయన టన్నెల్ వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ వివరాలను తెలిపారు. అవాంతరాలను అధిగమిస్తూ వేగంగా ఆపరేషన్‌ను కొనసాగించాలని అధికారులకు సూచించారు. సొరంగంలో ఆక్సిజన్ స్థాయి లేక, నీరు అధికంగా ఊరడం, టీబీఎం లోహ శకలాలు, రాళ్లు, మట్టితో అడ్డంకిగా మారడంతో సహాయక చర్యలకు ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 11న మళ్లీ తాను టన్నెల్‌ను సందర్శించనున్నట్టు మంత్రి తెలిపారు.

700 ఫీట్లు బోరేసినా చుక్క నీరు రాలే

- పాలమూరు జిల్లా చక్రాపూర్ రైతు మల్లేశ్ ఆందోళన

మూసాపేట, మార్చి 8 : మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మూసాపేట మండలం చక్రాపూర్‌కు చెందిన రైతు ఉప్పరి మల్లేశ్‌కు రెండెకరాల పొలం ఉన్నది. యాసంగిలో వరి సాగు చేయగా.. ఉన్న ఒక్క బోర్లు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో అడుగంటింది. చేసేదేమీ లేక మరో చోట బోరు వేయించాడు. 700 ఫీట్ల వరకు డ్రిల్లింగ్ చేయించినా చుక్క నీరు రాలేదని రైతు మల్లేశ్ వాపోయాడు.బోరు కోసం రూ.70 వేలకుపైగానే ఖర్చు అయ్యిందని వాపోయాడు. కాగా ఇదే మండ లం చక్రాపూర్‌కు చెందిన రైతు ఉప్పరి వెంకటేశ్‌కు కనకాపూర్ శివారులో నాలుగెకరాల ఉండగా మరి కొంత పొలం కౌలుకు తీసుకొని వరి సాగుచేశాడు. ఇప్పటివరకు పెట్టుబడి రూ.లక్ష వరకు ఖర్చు చేశాడు. 15 రోజుల నుంచి బోరులో నీటిమట్టం తగ్గడంతో మరో బోరు డ్రిల్లింగ్ చేయించాడు. 450 ఫీట్ల లోతు వరకు బోరు వేసినా చుక్క నీరు రాలేదు.

కలసి పనిచేయండి.. లేకుంటే కష్టమే

- సిద్ధూ, డీకేలకు ఖర్గే హితవు

కలబురిగి: కర్ణాటక అధికార పార్టీ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం స్పందించారు. కలిసికట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్‌లకు హితవు పలికారు. ఇరువురు దూరంగా ఉంటూ, వేర్వేరు దిశల్లో పయనిస్తే, అభివృద్ధి సాధించడం కష్టమవుతుందన్నారు. కల్యాణ పథ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో శనివారం ఆయన ఈ వ్యాఖ్య లు చేశారు. అభివృద్ధి చేయడాన్ని ఉపేక్షిస్తే, ప్రజలు మనల్ని ఇష్టపడరని హెచ్చరించారు. ఈ ఏడాది చివర్లో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే ఊహాగానాల నేపథ్యంలో ఖర్గే ఈ హిత వచనాలు పలికారు.

ఇంటి కుక్క పసిగట్టదా?

- మృతుల గుర్తింపులో మన శునకాల వైఫల్యం
- కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్
- రెండు స్పాట్లను గుర్తించిన కేరళ జాగిలాలు!
- మన డాగ్స్ వైఫల్యంపై చర్చ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి మృతదేహాలను గుర్తించేందుకు కేరళ నుంచి తీసుకొచ్చిన క్యాడవర్ డాగ్స్ ఇప్పుడు పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇతర రాష్ట్రాలు, నిఘా సంస్థలకు కూడా జాగిలాలకు శిక్షణ ఇచ్చి పంపిస్తున్న తెలంగాణలో.. అటువంటి డాగ్స్ లేకపోవడం చర్చనీయాంశమైంది. 'మన ఇంటి కుక్క పసిగట్టదా?' అంటూ పలువురు పోలీసులు ప్రశ్నించుకుంటున్నారు. ఇప్పటికే ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లిన తెలంగాణ స్నిఫర్ డాగ్స్ ఎలాంటి ఫలితాలు రాబట్టకుండానే తిరిగి వచ్చేశాయి. ఈ క్రమంలో కేరళ క్యాడవర్ డాగ్స్ ఇప్పటికే రెండు మృతదేహాల స్పాట్లను గుర్తించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణలో శిక్షణ పొందిన ఇతర జాతి జాగిలాలకు కూడా అటువంటి శిక్షణ ఇప్పించాల్సిన అవసరంపై చర్చలు కొనసాగుతున్నట్టు తెలిసింది.

95 శాతం ఫలితాలు

క్యాడవర్ రకం జాగిలాలు ఇప్పటివరకు 95 శాతం ఫలితాలను సాధించినట్టు రికార్డులు చెప్తున్నాయి. కేరళలోని వయనాడ్‌లో ఇటీవల సంభవించిన వరదలకు బురదలో కూరుకుపోయిన వారి ఆచూకీని కనిపెట్టడంలో క్యాడవర్ డాగ్స్ ముఖ్యపాత్ర పోషించాయి. 15 అడుగుల కింద మట్టిలో, బురదలో ఉన్న మానవ శరీర అవశేషాలు, కుళ్లిన మృతదేహాలను గుర్తించి తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. ఏ జాతి జాగిలమైన దానికి ప్రత్యేకంగా శవాలను వాసనపట్టి గుర్తించడంలో శిక్షణ ఇచ్చి క్యాడవర్ డాగ్స్‌గా నామకరణం చేస్తారు. ఎన్నో పోలీస్ కేసులను పరిష్కరించిన చరిత్ర వీటికి ఉన్నది. దట్టమైన చిట్టడువులు, చిత్తడి ప్రాంతాల్లో కూడా పనిచేయగలిగేలా వాటికి శిక్షణ ఇస్తారు. శరీర భాగాలు, అస్థిపంజర అవశేషాలు, కుళ్లిపోయే ద్రవాలతోపాటు కలుషితమైన మట్టిని గుర్తించగలవు. వైద్య పరీక్షల్లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడంలో, హత్యకేసులో దర్యాప్తులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగిన ఘటనల్లో ఇవి ఎంతో కీలకంగా పనిచేస్తాయి.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

- కూనంనేని ఆందోళన

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం నష్టపోయే రాష్ట్రాలకు తగిన రక్షణ కల్పించకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. శనివారం ముగ్దూంభవన్‌లో 'నియోజకవర్గాల పునర్విభజన-దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, కే శ్రీనివాస్, జస్టిస్ చంద్రకుమార్ తమ అభిప్రాయాలు తెలిపారు.

పీఆర్సీ నివేదిక రెడీ!

I తరువాయి...

ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో నిరీక్షించాల్సి వస్తున్నది. పీఆర్సీ నివేదిక అంటేనే సర్కారు జంకుతున్నదని ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివేదికను తీసుకోకుండా కాలయాపన చేస్తూ పీఆర్సీపై నెపం నెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఫిట్‌మెంట్ పెంచకపోతే !

హామీలు నెరవేర్చలేక, ఆదాయాన్ని సమీకరించుకోలేక సర్కారు సతమతమవుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌మెంట్ ఆశాజనకంగా లేకపోతే ఉద్యోగవర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకే పీఆర్సీ తేనెతుట్టెను కదిలించడం ఎందుకులే అనే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్కతో సమావేశమైనప్పుడు కూడా పెండింగ్ బిల్లులపై హామీ ఇవ్వడం తప్ప, పీఆర్సీ ప్రస్తావనే చేయలేదని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు.

ఉద్యోగుల పట్ల కేసీఆర్ ఔదార్యం

తెలంగాణ మొదటి పీఆర్సీ సీఆర్ బిశ్వాల్ కమిటీ నివేదికలో 7.5 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేసింది. కానీ కేసీఆర్ సర్కారు 30 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. ప్రభుత్వంపై ఏడాదికి రూ.12,595 కోట్ల అదనపు భారం పడినా, కరోనా కష్టాలు వెంటాడినా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్రను గుర్తించి, భారాన్ని భరించేందుకు సిద్ధపడింది. 2015లో 43 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు అంతకంటే తక్కువ ఫిట్‌మెంట్ ఇస్తే అసలుకే మోసం వస్తుందని ప్రభుత్వవర్గాలు జంకుతున్నాయని ఉద్యోగనేతలు అంటున్నారు.

తెలంగాణ మొదటి పీఆర్సీ బిశ్వాల్ కమిటీ వివరాలు

ఫిట్‌మెంట్ సిఫారసు	7.5%
కేసీఆర్ ప్రకటించించిన ఫిట్‌మెంట్	30%
ప్రభుత్వంపై ఏడాదికి భారం	రూ. 12,595 కోట్లు
2015లో ఫిట్‌మెంట్ అమలు	43%

బాకాయిల సంగతేంటి?

తెలంగాణ తొలి పీఆర్సీ గడువు 2023 జూన్ 30తో ముగియగా, జూలై 1 నుంచి రెండో పీఆర్సీని వర్తింపజేయాల్సి ఉంది. ప్రస్తుత పీఆర్సీలో పాత బకాయిలిస్తారా? ఎప్పుడిస్తే అప్పట్నుంచే వర్తింపజేస్తారా? అని ఉద్యోగుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఒక పీఆర్సీకి మరో పీఆర్సీకి మధ్యకాలానికి గల వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు 5 శాతం మధ్యంతర భృతిని ప్రకటించింది. ప్రస్తుతం రేవంత్ సర్కారు బకాయిలను మానిటరీ బెనిఫిట్స్ రూపంలో ఇస్తుందా? నోషనల్ బెనిఫిట్స్ రూపంలో ఇస్తుందా? అన్న సందిగ్ధంలో ఉద్యోగులున్నారు. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్, పీఆర్సీలో జాప్యం, ఐఆర్ ఇవ్వకపోవడం, డీఏలు కూడా పెండింగ్‌లో పెట్టడంపై సర్కారుపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఆర్ఏసీ ప్రయాణికులకు ఫుల్ బెర్త్‌లు

న్యూఢిల్లీ : ఏసీ బోగీల్లో ఆర్ఏసీ ప్రయాణికులకు ఫుల్ బెర్త్‌లు, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు భారతీయ రైల్వే ప్రకటించింది. గతంలో ఆర్ఏసీ ప్రయాణికులు ఒకే బెర్త్‌లో ఇద్దరు సర్దుకోవలసి వచ్చేది. ఈ ప్రయాణికుల సౌకర్యం, వ్యక్తిగత గోప్యతలపై ప్రధాన దృష్టితో ఈ మార్పులు చేశారు. తాజా విధానం ప్రకారం, వయోవృద్ధులు, మహిళలు, పిల్లలకు ప్రాధాన్యం ఇస్తారు.